# సమీక్ష (పేరడీ)



## మేండడి తిలక్

18—8—82

**మన రచయితల్లో** ఒకే విధమైన ఆలోచనా విధానానికి అలవాటుపడిన వారు కొందరున్నారు. వీరికి, వీరి స్వభావానికి పూర్తిగా విరుద్ధమైన కథ ఉన్న సినిమాను చూపించి సమీక్షించమంటే ఏ విధంగా సమీక్షిస్తారు అన్నది ఈ పేరడీకి వస్తువు.

ఆయా రచయితల మీద అభిమానంతో, హాస్యం కోసం రాసిన రచనే కనక వారుకానీ, వారి అభిమానులు కానీ అపార్థం చేసుకోరని భావిస్తాను.

## ఉషశ్రీ

( నాస్తిక భావాలతో తీయబడ్డ చిత్రాన్ని వీరికి చూపి, వ్యాఖ్యానించండి అని అడిగితే...)

శతాబ్దాలయినవో, సహస్రములే సాగినవో దైవ భావ మావిర్భవించి.

దైవ భావన ఆవిర్భవించి మానవకోటి విశిష్టమూ, విలక్షణమైన జీవన మార్గాన్ని సృజించుకోవడానికి దోహద మిచ్చిన వాస్తవాన్ని మరచిన కొందరు పెద్దలు దేముడున్నాడా? ఉంటే ఎక్కడ? వగైరా ప్రశ్నలతో తమ వంటి మేధావుల మనసుకు ఉల్లాసాన్ని కలిగించే ప్రదర్శనలు కొన్ని జరుపుతున్నారు. ఆ కోవలోనిదే ఈ చిత్రం.

భారతదేశాన్నే కాక, సమస్త భూమండలాన్నీ పునీతం గావించడానికి పరిఢవిల్లిన హిందూమతాన్ని చూసి, ఆ తేజస్సుకీ, ప్రకాశానికీ భయపడి, మేధావుల మనుకునే మహామహులు ఆ దైవ స్వరూపాన్ని దర్శించలేక విష పూత్కారాలతో రాహు కేతువుల వలె ఆక్రమింప జూస్తే ఆ గ్రహణం శాశ్వతమా? చంద్రుడు శాశ్వతమా?

ఆ చంద్రకాంతిని దర్శింప చేయడమే ఈ సమీక్ష లక్ష్యం. సూర్యుడు తూర్పున ఉదయిస్తున్నంత కాలం దైవం ఉంటుంది. మానవప్రాణి గాలి పీలుస్తున్నంత కాలం దైవ నామస్మరణ తప్పదు. అయితే కొందరు భక్తితో చేస్తే, మరి కొందరు ఈ సినిమా వారివలె ద్వేషంతో సాగిస్తారు. ఎవరికైనా దేముడే ధ్యేయం. అయినా కొందరు ప్రజలను పునీతులను చేసే మతాన్ని గౌరవించలేక, ఆ ఐశ్వర్యాలూ, ఆయురారోగ్యాలూ ప్రసాదించే భగవంతుణ్ణి ప్రార్థించలేక, సకల శుభాలనూ ఒనగూర్చే దేముణ్ణి దర్శించలేక, ఈ దైవ భావన మీద మసి పుయ్యడానికి ఎంతగానో ప్రయత్నిస్తున్నారు.

మతసాగరంలో మునిగి మణులూ, రత్నాలూ తెచ్చుకునే వారూ ఉన్నారు. నాస్తిక సాగరంలో మునిగి నత్తగుల్లలే ఏరుకుంటామనే ఈ సినిమా వారి లాంటి వారికీ, దూరంగా నిలిచి నమస్కారం!

## లల్లాదేవి

(వీరి కో 'సైన్సు ఫిక్షను' సినిమా చూపించి సమీక్షించమంటే... )

సినిమా హాలు ఆఫీసులో గంట మోగింది. అప్పుడు సినిమా ప్రారంభమైంది. నిండయిన హాలు. స్క్రీనుకు అల్లంత దూరంలో నేను ఆసీనుడనై ఉన్నాను. సినిమా జరుగుతూంది.

''స్విచ్చి నొక్కి ప్రపంచాన్ని ఆహుతి చెయ్యరా కంప్యూటరు యువకా'' అని రంకె వేసింది పాత్రధారిణి. కంప్యూటరు పరుగున వెళ్ళింది. ధరణిపై విరుచుకు పడింది. కుండపోతగా రక్త ధారలు కురిపించింది.



మనుష్యులు మృతి చెందారు. అస్తులు మిగిలినాయి. మరలా బతికినాయి. ప్రాణులు మహాప్రస్థాన స్థలికి చేరినాయి.

ఈ సన్నివేశాలు నా మదిలో ముల్లు నాటినాయి. ''సైన్సుకు ఇంత తెగింపా?'' అని హృదయం ఘోషించింది. నా గుండె బొగిలి బొగిలి ఏడ్చింది. సైన్సు ఎరగని ఆర్యానార్యులు పోరాడితే సమంజసమే. విజ్ఞత లేని కాలాన నరమేధం సబబే! మనిషి అవధులు లేని ఆకృతి సంతరించిన తరవాయి ఇదేమిటి?

తెరపై కొత్త సృష్టి జరుగుతున్నది.

నా భృకుటి ముడిపడింది. మనసు శుభాన్ని శంకించింది. పాత్రధారిణి పొగడ పూవు లాంటి పెదవుల మధ్యనుంచి మల్లె పూవు లాంటి మందహాసం జారిపడింది. నా నేత్రాలు అశ్రుతప్తాలైనవి.

చరిత్రలో విశేషాంశాలు ఎన్నో. కాలం గడిస్తే, కరుణిస్తే ఈమెకూడా చరిత్రలో పాత్రయై వెలుగు లోకాలకు చేరుకుంటుంది.

## మాలతీ చందూర్

( వీరికి మంచి డిటెక్టివ్ / క్రైమ్ థ్రిల్లరు సినిమా చూపిస్తే ఎలా సమీక్షిస్తారు? )

ఇంగ్లీషు సినిమావేత్తల విషధూమాలు మన సినిమావారిరక్తంలో జీర్ణించుకుపోతున్నట్లున్నాయి. ఇటీవల టోపీలు ధరించి అశ్వస్వారీ చేసే కౌబాయ్‌ల ఆంధ్రదేశంలో ఎక్కడున్నారో అర్థం కదు. అమెరికాలో సంచార నివాసులైన జిప్సీలు ఆవుల్ని కాస్తూ గుర్రాల మీద తుపాకులు పుచ్చుకుని తిరిగే వారు. వారి జీవనాన్ని ఉద్దేశించి హాలీవుడ్ కౌబాయ్ చిత్రాలు వెలువడ్డాయి. 1927, మార్చి 21 న వేమనరపు రామదాసు పంతులుగారు కౌన్సిల్ ఆఫ్ స్టేట్సులో విదేశాల నుంచీ వచ్చే సినిమాల లోని దృశ్యాలు ప్రజల నడతనీ, నీతినీ కించపరిచేవిగా ఉన్నవన్నారు. ఆయిల్ బావి తవ్వుతున్న వ్యక్తి గుడ్డ కరువై గుడారం గుడ్డనే వస్త్రాలుగా వాడితే జీన్సు పేరిట ప్రపంచంలో పెద్ద ఫ్యాషనైంది ఈనాడు. అవగాహన లేకుండా చేతితో కెమెరా, దానిలో రీలూ ఉన్నదని ఇంగ్లీషు చిత్రాలకు ట్రూ కాపీలు తీస్తే ఇట్టి చిత్రాలే తయారవుతాయి. అయిదుకోట్ల మంది ప్రేక్షకుల్లో ఎవరి కోసం సినిమా నిర్మాణం జరుగుతూందో తెలియక పోవడమే కారణం. హీరో నవ్వినా, ఏడ్చినా తెరపైకి చిల్లర విసిరే అభిమాను లుంటారు. సినిమా వారిపై ఈ క్రేజ్ మన దేశములోనే కాదు, నాగరకత ప్రబలిన ఖండాంతరాలలోనూ విశేషంగానే ఉన్నది. ఫ్రెంచ్ రచయిత బుస్కొడావిన్సీ అంటాడు, తన నవలలో, ''సమయం—సందర్భం తెలియని వాడు సినీమాలు తీస్తాడు'' అని. అవ్యంగ్య వ్యాఖ్యానాన్ని రుజువు చేస్తారా? తీర్పు చెప్పేది ప్రజలే కనక నా వ్యాఖ్య అనవసరమే అయినా, ముప్పై ఏళ్ళ బట్టి పాఠకులతో సంబంధం ఉంచుకోగల అదృష్టం ఉన్నది కనక రాస్తున్నాను.

## చివుకుల పురుషోత్తం

( వీరి కో కమ్యూనిస్టు భావనలు గల విప్లవ చిత్రాన్ని సమీక్షకై చూపిస్తే...)

భారత జాతి సంస్కృతిని కూలంకష పరిశీలన చెయ్యడానికి, తరాబ్దాలు చాలవు. హిమాలయాలలో తిరిగే యోగులకు విప్లవాలు తెలియవు. అయినా సాధించేది లోక కల్యాణమే. యోగి విద్య, వైద్య శాస్త్రంలో విప్లవం. రామకృష్ణుడు మతంలో విప్లవం. విప్లవం అంటే చొక్కా విప్పుకుని అరిచేదే కాదు.

కర్మ సిద్ధాంతానికీ, గతి తార్కిక భౌతిక వాదానికీ, దైవస్వరూపుల ప్రవచనాలకీ...

చిత్రంలో పెడబొబ్బలు పెట్టి చొక్కా విప్పుకుని తిరిగిన కథానాయకుడు సాధించ దలచింది ఏమిటో అర్థంకాక పోవడం నా అవగాహనా లోపం కాదు

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

( వీరికి ఒక పతివ్రతామతల్లి మాహాత్మ్యం పౌరాణిక సిన్మా చూపించి సమీక్ష రాయమంటే..)

మొగుడు శ్రీపతీ ఎటాక్ అయినా రసికుడు గానే ఉండి, "ఏమేవ్" అని అరవడం. "రారా" అని పిలవడం,..ఇలా సాగింది.

తారల తెర వెనక జీవితాలు తెలిసీ, సిన్మా చూస్తే చిరాకు పుట్టింది. "పతివ్రతలవగా వీరే..) చెప్పాడు డైరెక్టర్ చివర్లో బ్యాక్‌గ్రౌండ్ నుంచి.

"ఇన్ని కష్టాలు పడాలా? శుభ్రంగా గర్భనిరోధక మాత్ర లుంటే..."చెప్పింది వెనక నించి ఒక బెల్ బాటమ్ అమ్మాయి. తెల్లగా నవ్వినప్పుడు బాగుంది.

వేశ్యగా వేషం కట్టిన అమ్మాయి ముద్దు సీన్లలో కళ్ళు మూసుకుంటూంది తన్మయత్వంలో? అంతా యాక్షన్. నటన!

పతివ్రత చెల్లి సూసైడ్ చేసుకుంది, మా. ఇంటి పక్కన గోదావరి చెల్లెలు శబరి లాగా. చనిపోయే ముందు చెప్పిందట శబరి—"నా చావుకి కారణం నా కడుపులో బిడ్డ" అని.

"కడుపులో బిడ్డకి కారణం ఎవరు?" అన్నాను నేను తరవాత గోదావరితో.

"వాళ్ళ క్లాస్‌మేట్" చెప్పింది గోదావరి సిగ్గు పడి, గోళ్ళు కొరుక్కుని నవ్వుతూ.


పతివ్రతకి దేముళ్ళు ప్రత్యక్ష మయ్యారు మొగుడికి జబ్బు నయమై నవ మన్మథుడై పోయాడు.

"ఇంతకీ పెత్రివోత్ అంటే ఎవ్రు షిర్" పక్కనే బారుమిత్రుడు నోరు కంపు కొట్టింది. ప్రెండు కనక భరించాను.

"చివరలో దేముళ్ళు కనపడే వాళ్ళవు మాట!" చెప్పాను పెదాల చివర్లో నవ్వుకుంటూ! డైరెక్టర్‌కి కూడా అదే ప్రశ్న వచ్చినట్లుంది. ప్రత్యేకంగా స్టిల్ ఫొటో ప్రొజెక్టు చేసి రెండు నిమిషాలు బొంగురు గొంతుతో ఏదో చెప్పాడు.

## రంగనాయకమ్మ

( వీరికి మలయాళ సెక్సు చిత్రం చూపించాం!)




సినిమా చూడటం వేరు, అర్థం చేసుకుని ఆస్వాదించడం వేరు. స్త్రీ శరీరం చూపించి డబ్బులు చేసుకునే ద్రాష్టుడు తీసిన సినిమా ఇది. తల్లిగా, చెల్లిగా స్త్రీకి గౌరవం లేని దేశం ఇది. కనీసం వెలంలా గౌరవించడంకూడా రాదు.

ఈ సినిమా చూస్తుంటే, అసలు మనం ఏ యుగంలో ఉన్నాం? మన దేశం ఎప్పటికైనా బాగుపడుతుందా? మార్క్సిస్టు దృక్పథం మన వాళ్ళ కెప్పటికైనా అలవడుతుందా? కనీసం సోషియలిస్టిక్ సమాజ స్థాపనలో మనం మొదటి మొక్కైనా పెంచామా?




## ఎస్. ఆర్. నంది

( వీరికి శాస్త్రీయ సంగీత సిన్మా చూపించి సమీక్ష చెయ్యమన్నాం! )

వెంకటేశ్వరరావు చెప్పడం మొదలుపెట్టాడు.

"శాస్త్రీయ సంగీతం చాలా గొప్పది, బాబాయి గారూ. ఈ సిన్మానే చూడండి. ఇంగ్లీషు వాళ్ళ శాస్త్రం వేరు,బాబాయిగారూ. వాళ్ళ పాప సంగీతానికి సూత్రాలు వేరు. మంత్రాలూ, ఎత్తులూ దింపులూ వేరు. దేని స్పెషాలిటీ దానిదే!"

"నాకు ఈ సంగీతం మీద ఆసక్తి లేదు, వెంకటేశ్వర్రావ్. నువ్వు దాన్ని గురించి చెప్పకు. సినిమా చూసి ఆలోచించుకో నివ్వు" అన్నాను.

## కొండముది శ్రీరామచంద్రమూర్తి

(వీరి కో హాస్య చిత్రం సమీక్షకై వచ్చింది.)

ఫైర్‌స్టేషన్ దాటి, సెంటర్ దాటి, హోవర్ బ్రిడ్జి దాటి, కేసరి దాటి సిన్మా హాలుకు చేరుకుని, టిక్కెట్టుకొని సీటు వెతుక్కుని కూర్చుని సిన్మా చూడ్డం మొదలు పెట్టాను. హీరో హాస్యం కోసం నానా రకాల వంకర్లు తిప్పుతున్నాడు. అతడి అద్భుత మైన కళావిన్యాసానికి ముగ్ధుడినై పోయాను. అసలు లక్ష్యం లయించినా లేకున్నా అతడికి శరీరంపై గల అజమాయిషీకి...

## బులేనా రచయిత

( వీరికి ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి వర్తతరంగిణి చూపించి సమీక్ష రాయమన్నాం. )

సినిమా పాపిష్టిది. దాని దుంప తెగిరి, బాగా తీసినప్పుడు బాగానే ఉంటుంది కానీ, చెడగొడితే మట్టుకు పాణాలు తీసుద్ది. సుత్తి ఏసుద్ది. మన వేమో కాసేపు కుశీ చెయ్యటానికని సిన్మాకి బోతే బలవంతంగా కూకోపెట్టి గవుర్నుమెంటోళ్ళు అళ్ళ సినిమా సూపిచ్చేత్తన్నారు. అసలు దీనికి వస్తవరోరం వస్నూలు జెయ్యాలి అలుసొత్తే. మదరాసు నుంచి హైదరాబాదు రాటానికి పాతికేళ్ళుగా దేకుతుంది ఇండసిటిరీ. పడవిలో కొచ్చిన పెలివోడూ వచ్చేతంది, వచ్చేతంది అని కేకలు పెట్టి తప్పుకుంటువున్నడు. అదేమో ఇంకా పాండీబజార్లోనే దొల్లుతా ఉంది. పెగతి పెగతి పెగతి—అరగంట సేపూ ఇదే సొద. ముక్కెమంతిరి పబ్లీకు పాయిఖానీ రిబ్బను దెంపి నందుకో పూటూ, దగ్గితే పూటూ, తుమ్మితే పూటూ—అప్పటికీ మన కుర్రోళ్ళు ఈల్లేసి గోల జేత్తానే ఉన్నారు, తొందర్గా తీసేసి అసలు బొమ్మ ఎయ్యమని. ఏదీ? ఆడు ఇనిపించుకోందే? మొత్తం ఫిల్ము ముక్కంతా తిప్పి గానీ ముయ్య లేదు. ఎరగ నోడైతే ఇంకేవుంది? స్టేటు సార్గానికి తావై పొనాది అని మూర్ఛ పోయివోడు. ఈళ్ళ దివసాలు బెట్ట. మా బోల్డు కైపు ఎళ్ళి నాలుగ్గుద్దులు గుద్దొచ్చినా బాగుణ్ను. ★